ఫాగింగ్ ప్రక్రియ చేపట్టేదెప్పుడో?

- కుక్కునూరు మండలంలో దోమల బెడద
- జ్వరాల బారిన ప్రజలు


రామసింగారం వద్ద పెరుకుపోయిన చెత్త

కుక్కునూరు: వర్షాకాలం, దీనికి తోడు గోదావరి వరద గ్రామాల్లో దోమలతో వచ్చే వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కునూరు మండలంలో రోజురోజుకీ జ్వర పీడుతుల సంఖ్య పెరుగుతోంది. ఐనా, దోమల నియంత్రణకు చర్యలు కరువయ్యాయి. గ్రామ పంచాయతీల్లో ఇంతవరకు ఫాగింగ్ ప్రక్రియ చేపట్టలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దోమల తీవ్రతతో జ్వరపీడుతుల సంఖ్య పెరిగి ఆర్ఎంపీల నుంచి, పీహెచ్‌సీల వరకు జ్వరపీడుతులతో నిండిపోతున్నారు. కొందరు జ్వరపీడుతులు భద్రాచలం వంటి ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వర్షం కురిస్తే చాలు పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచి దోమల బెడద ఎక్కువవుతుంది.

ఫాగింగ్ మెషీన్లు ఉన్నా ఫలితం శూన్యం

కుక్కునూరు మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో ఫాగింగ్ మెషీన్లు ఉన్నాయి. వాటిని వినియోగించిన దాఖలాలు కనపడడం లేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే ఫాగింగ్ మెషీన్ ఆపరేట్ చేసే వ్యక్తి ఒక్కడే ఉన్నాడని, అతనే అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ చేయలేదని చెప్పడం కొసమెరుపు. పోని ఆ ఒక్కడితోనైనా మండలంలో ఎక్కడైనా ఫాగింగ్ చేయించారా అంటే ఇంకా లేదనే సమాదానం వినిపిస్తుంది. గోదావరి వరదల నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఓ వైపు జిల్లా అధికారులు సూచిస్తున్నా, స్థానిక అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా మండల పరిషత్ అధికారులు ఫాగింగ్ ప్రక్రియను చేపట్టి దోమల బెడదను నిర్మూలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోతున్న చెత్త



మా ఇంటి ముందు ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు పోయే దారిలేక దోమల బెడద ఎక్కువైంది. నీరు పోయేవిధంగా చర్యలు చేపట్టాలని గతంలో పలుమార్లు పంచాయతీలో చెప్పినప్పటికీ ఇంతవరకు చర్యలు చేపట్టిన పాపనపోలేదు. పోని దోమలు నియంత్రించే దిశగా ఫాగింగ్ ప్రక్రియను చేపట్టారా అంటే అదీ జరగలేదు.

– మాదిరాజు ఖాదర్‌బాబా, కుక్కునూరు

ఫాగింగ్ ప్రక్రియను వెంటనే చేపట్టాలి



మండలంలో ఎక్కడా ఫాగింగ్ ప్రక్రియను చేపట్టిన దాఖలాలు లేవు. వర్షాకాలం ఓ పక్క దోమల బెడదతో జ్వరపీడుతుల సంఖ్య పెరుగుతోంది. ఐనా పంచాయతీ అధికారులు దోమలను నియంత్రించే దిశగా ఫాగింగ్ ప్రక్రియ చేపట్టడంలో తాత్సరం చేస్తున్నారు. పరిస్థితి చేయి దాటిన తరువాత చర్యలు చేపట్టినా ప్రయోజనం ఉండదు.

– యర్నం సాయికిరణ్, చిరవెల్లి, కుక్కునూరు (మండలం)

వినాయకా.. సెలవిక

ద్వారకాతిరుమల: చిత్రవిచిత్ర వేషధారణలు, డిజే సందళ్లు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, యువత డాన్స్‌ల నడుమ ద్వారకాతిరుమలలో శనివారం జరిగిన గణేష్ నిమజ్జనోత్సవం కనులపండువగా నిర్వహించారు. వసంత్‌నగర్ కాలనీలో వినాయక విగ్రహాన్ని క్షేత్ర వీధుల్లో ఊరేగించారు. రాత్రి పంగిడిగూడెంలోని పోలవరం కుడి కాలువలో నిమజ్జనం చేశారు.

● **లింగపాలెం :** మండలంలోని ధర్మాజీగూడెం, లింగపాలెం, మఠంగూడెం, శింగగూడెం, కలరాయునగూడెం, అయ్యపరాజుగూడెం, కొత్తపల్లి, రంగాపురం, యడవల్లి తదితర గ్రామాల్లో వినాయక ఊరేగింపులు అట్టహాసంగా నిర్వహించారు. పోలీస్ బందోబస్తు నడుమ గణనాథులను చెరువుల్లో నిమజ్జం చేశారు.

● **కొయ్యలగూడెం:** ఆదివారం చంద్రగ్రహణం ప్రభావం కారణంగా శనివారం అనేక చోట్ల గణనాథులను గంగమ్మ గుడికి తరలించారు. మండల వ్యాప్తంగా 20కి పైగా గణనాథుల విగ్రహాలను బాణసంచాలనడుమ సాగనంపారు. సత్యసాయి నగర్‌లో గణనాథుని విగ్రహం వద్ద కాళికా నృత్యాలు, బుట్ట బొమ్మల ఆటలు నిర్వహించారు. కన్నాపురంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద గణనాథుని ఊరేగింపు నిర్వహించారు.


● **పోలవరం రూరల్:** పోలవరం మండలంలో కొలువుదీరిన గణేష్ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పట్టిసీమ గ్రామంలో గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలంతా ఒకే రంగుచీరలు ధరించి పాల్గొన్నారు.

●**బుట్టాయగూడెం:** మండలంలోని పలు గ్రామాల్లో గణేషుని ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. అనంతరం గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● **జంగారెడ్డిగూడెం:** పట్టణంలో వివిధ పందిళ్ల వద్ద నెలకొల్పిన గణనాథుల గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కేకేఎం ఎర్రకాలువ జలాశయంలో నిమజ్జనం చేశారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో గాంధీ బొమ్మల సెంటర్లో ఉన్న ముక్కోటి రామాలయం వద్ద వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధన ఏర్పాటుచేశారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.


ద్వారకాతిరుమల : ఊరేగింపులో బాలలు, యువత సందడి


బుట్టాయగూడెం : గణేషుని ఊరేగింపు


ద్వారకాతిరుమల : గణేషుడి ఊరేగింపు


లింగపాలెం, ధర్మాజీగూడెంలో వినాయక ఊరేగింపు


కొయ్యలగూడెం : ఊరేగింపులో కాళికా నృత్యం


పోలవరం రూరల్ : గణేష్ నగర్‌లో వినాయక నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు


జంగారెడ్డిగూడెం : గణనాథుడి ఊరేగింపు

యూరియా వరి చేలకే వినియోగించాలి


కామవరపుకోట సొసైటీలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న సుబ్బారావు

కామవరపుకోట: యూరియాను వరి సాగు చేసే రైతులే వినియోగించాలని చింతలపూడి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు అన్నారు. మండలంలో కామవరపుకోట, తడికలపూడి ఎరువుల షాపుల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. మండలంలో ప్రస్తుతం సొసైటీల వద్ద 31.140 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 29.900 టన్నులు మొత్తం 61.040 టన్నులు యూరియా నిల్వలు, అమ్మోనియం సల్ఫేట్ 160.000 టన్నులు నిల్వలు ఉన్నట్టు సుబ్బారావు తెలిపారు. ఉద్యానవన పంటలకు ముఖ్యంగా ఆయిల్‌పామ్ పంటకు అమ్మోనియం సల్ఫేట్ వినియోగించుకోవాలన్నారు. వరి పంట సాగు చేసే రైతులకు మాత్రమే ఒకటి నుంచి రెండు బస్తాలు యూరియా ఇవ్వాలని సొసైటీ సెక్రటరీలు, ప్రైవేటు ఎరువులు షాపుల యజమానులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

కొయ్యలగూడెం: యూరియా కొరత లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి కేవీఎస్ పోసారావు పేర్కొన్నారు. కొయ్యలగూడెం డీలర్ల కేంద్రాల్లో ఎరువులను శనివారం ఆయన పరిశీలించారు. సార్వా సీజన్లో వరి 7,400 ఎకరాలు సాగు చేస్తున్నారని, రైతులు మొదటి విడత యూరియా పంటకు వేశారని తెలిపారు. రెండో విడతకు మండలంలో 78 టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. అధిక ధరలు, కృత్రిమ కొరత సృష్టించినా, యూరియాకు వేరే ఎరువులను జత చేసి తీసుకోమని రైతులను ఇబ్బంది పెట్టినా డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్వరలో స్వచ్ఛ రథాలు


ఎంపీడీఓతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీహరి

బుట్టాయగూడెం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఉన్న మండలాల్లో 13 ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జెడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఖాళీ పోస్టులను రెండు, మూడు రోజుల్లో పదోన్నతి పొందిన వారితో భర్తీ చేస్తామని చెప్పారు. గ్రామ పంచాయతీల్లో 709 వాట్సాప్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కౌషలం సర్వే ద్వారా 93,984 మందిని సర్వే చేసి అర్హులను గుర్తించిందన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం కోసం త్వరలో స్వచ్ఛరథాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. 8 మండలాల్లో ప్రయోగాత్మకంగా స్వచ్ఛ రథాల ద్వారా తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జ్యోతి పాల్గొన్నారు.

యూరియా కొరతతో ఇబ్బందులు


జంగారెడ్డిగూడెం : మాట్లాడుతున్న కర్పూరం గవరయ్య గుప్తా, నాయకులు


కుక్కునూరు : మాట్లాడుతున్న పార్టీ మండలాధ్యక్షులు రాజేష్

జంగారెడ్డిగూడెం: యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కర్పూరం గురవయ్య గుప్తా అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత నేపథ్యంలో ఈ నెల 9న ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు. స్థానిక జెట్టి గురునాథరావు కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి పాదయాత్ర నిర్వహిస్తామని, ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీవీఆర్ చౌదరి, ముప్పిడి శ్రీను, ముప్పిడి వీరాంజనేయులు, పీపీఎస్ చంద్రరావు, వెంప ఐజి, అడబాల రాంబాబు, చిప్పాడ వెంకన్న, నేకురి కిషోర్, వీరవెల్లి సోమేశ్వరరావు, కంచర్ల విష్ణు, కార్యదర్శి ఉడా నాగేంద్ర పాల్గొన్నారు.

అన్నదాతకు క్షోభ

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం అన్నదాతను క్షోభకు గురిచేస్తోందని, యూరియాను అందించడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాండ్ర రాజేష్ విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. యూరియా కోసం అన్నదాతలు గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కుక్కునూరులో శనివారం గ్రోమోర్ ఆధ్వర్యంలో చేపట్టిన యూరియా పంపిణీలో యూరియాతో పాటు ఎఫ్–2 ఎరువులను తీసుకోవాలని కండీషన్ పెట్టడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు యూరియాను సమృద్ధిగా డిమాండ్ చేశారు. నాయకులు రాయి సత్యనారాయణ, గాదిడ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

9న రైతు పోరు


వాసిరెడ్డి మధుసూధనరావు

టి.నరసాపురం: యూరియా కొరతపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతు పోరు నిర్వహించనున్నట్టు పార్టీ రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధుసూదనరావు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలుగా అవస్థలు పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ట్రంప్ సుంకాల రద్దుకు డిమాండ్

వేలేరుపాడు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై చేస్తున్న పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ, ట్రంప్ విధించిన సుంకాలను రద్దు చేసే విధంగా భారత ప్రభుత్వం అమెరికాపై ఒత్తిడి తేవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వామపక్షల పిలుపులో భాగంగా శనివారం వేలేరుపాడులో నిరసన వ్యక్తం చేశారు.

●**చింతలపూడి :** ట్రంప్ అధిక సుంకాలకు నిరసనగా సీపీఎం, సీపీఐ, రెడ్ స్టార్ ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేశారు. బోసుబొమ్మ సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

●**కామవరపుకోట:** ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో కామవరపుకోటలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పార్టీ మండల కన్వీనర్ టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు.

●**జంగారెడ్డిగూడెం:** దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అమెరికా విధానాలను నిరశిస్తూ ధర్నా చేశాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి: శెట్టివారిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ శెట్టివారిగూడెం 24 గంటల ఫీడర్, వెంకటాద్రిగూడెం ఏజీఎల్ ఫీడర్లకు శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11 కేవీ శెట్టివారిగూడెం ఏజీఎల్ ఫీడర్‌కు ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్‌అహ్మద్‌ఖాన్ తెలిపారు.

నేడు మద్ది క్షేత్రం మూసివేత

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసివేసి, శుద్ధి అనంతరం సోమవారం ఉదయం 9 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభిస్తామని ఆలయ ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 9 హనుమద్ హోమం నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేక సేవ కార్యక్రమం నిర్వహించారని, మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,00,010 సమకూరిందని ఈఓ వివరించారు.

ఉత్తమ ప్రవర్తనతో ఆదర్శంగా నిలవాలి

కామవరపుకోట: ఉపాధ్యాయులు తమ ఉత్తమ ప్రవర్తనతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎంఈఓ డి.సుబ్బారావు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓ–2 చిన్నం ప్రశాంత్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి

లింగపాలెం: విద్యార్థులను దేశానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు కంటా రామారావు, జంగం రవీంద్ర అన్నారు. శనివారం మండలంలోని ధర్మాజీగూడెం మోడల్ ప్రైమరీ పాఠశాల్లో టీచర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, సీఆర్ఎంటీలను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుని ఎస్‌కే సజిత బేగం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులకు ఘన సత్కారం

ద్వారకాతిరుమల: పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. దొరసానిపాడులోని ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం కె.మోహన్ గోపి పుల్లారావు, ఉపాధ్యాయులు పి.రాంబాబు, టి.అశ్విని లను గ్రామ పెద్దలు, ఎస్ఎంసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎస్ఎంసీ వైస్ చైర్మన్ ఎం.గోపిరాజు, వెంకటేశ్వరరావు, దిర్శిపాం వెంకటేష్, జొన్నకూటి శివ, నాగరాజు, జంగం అర్జున్ తదితరులున్నారు.

క్లుప్తంగా

కోడె నాగు పట్టివేత


కోడె నాగును పట్టుకున్న క్రాంతి

జంగారెడ్డిగూడెం: స్థానిక జ్యుడీషియల్ కోర్టు చాంబర్‌లోకి 7 అడుగుల కోడినాగు ప్రవేశించింది. అటెండర్ పామును గమనించి స్నేక్ సేవియర్ సొసైటీ సంస్థకు సమాచారం అందించగా సంస్థ అధ్యక్షులు చదలవాడ క్రాంతి సమీపానికి చేరుకుని పాముని పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. వన్యప్రాణులు మానవ మనుగడకు ఎంతో ఉపయోగకరమైనవి, వాటిని చంపకుండా స్నేక్ సేవియర్ సొసైటీకి సమాచారం అందించాలని కోర్టు సివిల్ జడ్జ్ సిహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడిగా గురునాథం రెడ్డి



జంగారెడ్డిగూడెం : వైఎస్సార్‌సీపీ జంగారెడ్డిగూడెం మండల ఉపాధ్యక్షుడిగా మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన నిమ్మ గురునాథం రెడ్డి నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు నియామక ఉత్తర్వుల జారీ చేశారు. ఈ సందర్భంగా గురునాథంరెడ్డి పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. కంభం విజయరాజు, జెట్టి గురునాథరావు, ఓరుగంటి నాగేంద్ర, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

మిథున్ రెడ్డిని కలిసిన జెట్టి


ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన జెట్టి, నాయకులు

జంగారెడ్డిగూడెం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పార్టీ జంగారెడ్డిగూడెం మండల, పట్టణ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో పార్టీ జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు కర్పూరం గవరయ్య గుప్తా, ఏలూరు జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు చింతా అనిల్ గౌడ్, జంగారెడ్డిగూడెం యూత్ అధ్యక్షులు నేకూరి కిషోర్ తదితరులు ఉన్నారు. తామంతా మిథున్‌రెడ్డి వెన్నంటే ఉంటామని తెలిపారు.

విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తేవాలి

కామవరపుకోట: ప్రభుత్వం విద్య, వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చారని, 17 వైద్య కళాశాలలు నిర్మాణం చేపట్టి, కొన్ని పూర్తి చేశారని పేర్కొన్నారు. ఆస్పత్రులను ఆధునికరించి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని వివరించారు. నేడు కూటమి ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణాన్ని ప్రైవేటుపరం చేసే దుర్మార్గమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

జెడ్పీటీసీకి అభినందన

పోలవరం రూరల్: ఇటీవల త్రివేణి సంగమం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజా రమణ ఆధ్వర్యంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరున అవార్డు అందుకున్న పోలవరం జెడ్పీటీసీ కలుం హేమకుమారిని బుట్టాయిగూడెం మండలం 14 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు అభినందించారు. శనివారం జెడ్పీటీసీ నివాసంలో హేమకుమారి దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు.

ఆరోగ్యంపై అవగాహన

కామవరపుకోట: కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని జంగారెడ్డిగూడెం సెక్టార్ అంగన్‌వాడీ సీడీపీఓ పి.బ్యూల సూచించారు. పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలం తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టిక ఆహారం, నెలసరి పీరియడ్లపై అవగాహన కల్పించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.2,11,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు రూ.1,00,000, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన బి.సుబ్బారావు రూ. 1,11,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజా రావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

శ్రీవారి సేవలో క్యారెక్టర్ ఆర్టిస్ట్

ద్వారకాతిరుమల: స్థానిక చినవెంకన్న ఆలయాన్ని ప్రముఖ సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ వెంకట్ గిరిధర్ శనివారం సందర్శించారు. తాను నటించిన శ్రీ ఆంజనేయం, అతడు, దువ్వాడ జగన్నాథం వంటి పలు చిత్రాలు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయని ఆయన తెలిపారు.

సంక్షిప్తం

ఉచిత సర్జరీలు

కొయ్యలగూడెం: ప్రభుత్వం ద్వారా 3225 వ్యాధులకు శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ వైద్య సేవ డిస్టిక్ కోఆర్డినేటర్ ఐ.రాజీవ్ పేర్కొన్నారు. బయ్యనగూడెం పీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు.

లడ్డూ ఎట్ రూ.35 వేలు

జంగారెడ్డిగూడెం: స్థానిక సిద్ధి వినాయక స్వామి వారి 37వ వార్షికోత్సవ ఉత్సవ కమిటీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి మండపంలో ఏర్పాటుచేసిన లడ్డు ప్రసాదం రూ.35 వేలు పలికింది. స్థానిక వ్యాపారి కె.గంగాధరరావు దీనిని దక్కించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరి ఆలయంలో శనివారం సందరభంగా స్వామి వారికి విశేష పూజలు చేవారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా ఆలయం ఉదయం 11.30 గంటలకు మహా నైవేద్యం అనంతరం మూయబడుతుందని, తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులు దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

చింతలపూడి: ప్రగడవరం జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు పోత్సాహక బహుమతులు అందజేశారు. శనివారం పాఠశాలలో హెచ్ఎం డి.సంపూర్ణ గత విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బాలురు, బాలికలకు రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున అందజేశారు. మొత్తం రూ.50 వేలను 20 మందికి అందజేశామని హెచ్ఎం తెలిపారు. ప్రగడవరం స్కూల్ పౌండర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి కుమారుడు డాక్టర్ అరుణ్‌కుమార్ ఈ నగదు అందించారని చెప్పారు.

దుష్ప్రచారాలు చేస్తే చర్యలు

జంగారెడ్డిగూడెం: చికెన్ వ్యర్థాలు అమ్ముకుంటున్నామంటూ తమపై దుష్ప్రచారాలు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం పట్టణంలో చికెన్ దుకాణాల అసోసియేషన్ ప్రెసిడెంట్ యర్ర అప్పారావు అన్నారు. గురువారం అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సంబంధం లేని వ్యక్తులు కోడి వ్యర్థాలు అమ్ముకుంటున్నామని ఫేస్బుక్, వాట్సప్ సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. యూనియన్, సెక్రటరీ బాలకృష్ణ, భాస్కర్, బాబురావు, నూకరాజు, షేక్ శిలార్ పాల్గొన్నారు.

కబడ్డీ లీగ్ జట్టుకు విద్యార్థి ఎంపిక

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పొడుగు లోవా బాబు అనే విద్యార్థి (బీఏ) యువ ఆంధ్ర కబాడీ లీగ్ జట్టుకి ఎంపికయిటన్లు ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు తెలిపారు. స్టేట్ కబడ్డి లీగ్‌లో భీమవరం గ్లాడియేటర్స్ టీమ్‌లో ఎంపికయి విజయవాడ కళాశాల తరపున ఆడినందుకు లోవబాబుకు శనివారం ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ బి. శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం మధు మాట్లాడారు.

నారసింహునికి ప్రదోషకాల శాలిగ్రామ అభిషేకం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత ఆలయమైన, ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ కనకవల్లీ సమేత నరసింహ స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం సాయంత్రం ప్రదోషకాల శాలిగ్రామ అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు.